క్లుప్తంగా

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, గాలి అనిల్‌కుమార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి దివంగత ఫరీదొద్దీన్ కుమారుడు, టీఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ శుక్రవారం తన నివాసంలో ఇచ్చిన ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు. విందులో బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, నాయకులు మంకాల్ సుభాష్, తట్టు నారాయణ, కుతుబొద్దీన్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాములు నేత, మోతిరాం పాల్గొన్నారు.

బంధం కొమ్ము చెరువును కాపాడాలి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని బంధం చెరువును కాపాడాలని ప్రముఖ సోషల్ వర్కర్ 'జనం కోసం' సంస్థ వ్యవస్థాపకుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంధం కొమ్ము చెరువును కొంత మంది రాత్రింబవళ్లు మట్టిపోసి పూడ్చివేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. చెరువులు పరిరక్షించాలని కోరుతూ ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు గుర్తుచేశారు. చెరువు పరిరక్షణ కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంధం కొమ్ము చెరువును పరిరక్షించాలని ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తామని తెలిపారు.

భత్యం చెల్లించాలని ధర్నా


ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

నారాయణఖేడ్: గత శాసనసభ ఎన్నికల్లో ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 54 రోజుల పాటు ఎన్నికలకు సంబంధించిన విధుల్లో పాల్గొన్న తమకు వెంటనే భత్యం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాధితులైన జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు శుక్రవారం ఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ భత్యం చెల్లించకపోవడం విచారకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్స్ అత్యవసర నిర్వహణ, మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 6:30 గంటల నుంచి 7 గంటల వరకు 30 నిమిషాలు బంధం కొమ్ము గ్రామం, ఓడీఎఫ్ కాలనీ, మారుతిహిల్స్, కృష్ణ బృందావన్ కాలనీ, మైత్రి కాలనీ, లక్ష్మిహోమ్స్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అమీన్‌పూర్ సెక్షన్ ఏఈ ఆపరేషన్ వెంకట్రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం 7:30 గంటల నుంచి 8 గంటల వరకు కేజీఆర్, సాయి విల్లాస్, గ్రీన్ విల్లాస్, ఆర్‌ఆర్ 30 నిమిషాల పాటు హోమ్స్, ఎస్‌ఎస్ హోమ్స్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 8:30 వరకు అమీన్‌పూర్ విలేజ్ సాయిరాం ఎన్‌క్లేవ్, పీఎస్‌ఆర్ కాలనీ, లాలాబాయి కాలనీ, లక్ష్మిహోమ్స్, సత్యకృప, త్రిపుర ఎన్‌క్లేవ్ కాలనీ, లింగమయ్య కాలనీ, భవానిపురం, సాయిరాంకాలనీ, కేసర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఉదయం 8:30 గంటల నుంచి 9 గంటల వరకు అమీన్‌పూర్ పరిధిలోని సాయిరాజేశ్వరి కాలనీ, చక్రపురి కాలనీ, హైడ్‌పార్క్, శ్రీవాణి నగర్, సబ్వే హోమ్స్, ఎంపైర్ విడోస్ విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని సూచించారు.

హరికృష్ణను కలిసిన నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణను మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థిగా తన ఎంపికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నీలం మధు వెంట దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.


హరికృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

జొన్న సాగు.. సిరులు బాగు

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో రైతులు జొన్న పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పంట కాలంలో పండించే జొన్న ఎక్కువగా పశువుల దాణా, కోళ్ల మేత కోసం ఉపయోగిస్తారు. రబీ పంటలో సాగుచేసిన జొన్నపంటను ఏకమొత్తంగా ఆహారపు అవసరాలకు వినియోగిస్తారు. ఇటీవల కాలంలో ఆరోగ్యాన్నిచ్చే ఆహారపు పంటగా జొన్న బహుళ ప్రజాధరణ పొందింది. మార్కెట్‌లో కూడా ధర ఆశాజనకంగా ఉండడంతో జొన్నను రబీలో ఎక్కువ స్థాయిలో పండించడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

– జహీరాబాద్ టౌన్


మునిపల్లి మండల కేంద్రంలో సాగు చేసిన జొన్న పంట

- జిల్లాలో పెరిగిన పంట విస్తీర్ణం
- తక్కువ నీటితో ఎక్కువ లాభాలు
- మార్కెట్‌లో ధర ఆశాజనకం
- జొన్న సాగుపై రైతుల ఆసక్తి

జిల్లాలోని నారాయణఖేడ్, మనూర్, కల్హేర్, మునిపల్లి, రాయికోడ్, న్యాల్‌కల్, కోహీర్, జహీరాబాద్, ఝరాసంగం తదితర మండలాల్లో జొన్న పంట అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. జహీరాబాద్ ప్రాంతం కర్నాటక సరిహద్దులో ఉండటంతో కర్నాటక రాష్ట్రంలో కూడా ఈ పంటను ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగుచేస్తున్నారు. జిల్లాలో గత సంవత్సరం జొన్న పంట సుమారు 30 వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ సంవత్సరం విస్తీర్ణం రెటింపు అయింది. సుమారు 59 వేల ఎకరాల్లో రైతులు జొన్నపంట ఎక్కువగా సాగుచేస్తున్నారు.

సాగుకు నల్లరేగడి నేలలు అనుకూలం

ఈ సంవత్సరం తక్కువ వర్షాలు కురడంతో సాగు నీరు లేని రైతులు తక్కువ నీటితో పండే పంటలపై దృష్టిపెట్టారు. యాసంగిలో రైతులు జొన్న పంట సాగుకు ఆసక్తి చూపడంతో జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధిక విస్తీర్ణం పెరిగింది. జొన్న పంటకు నల్లరేగడి నేలలు అనుకూలంగా ఉండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మార్కెట్‌లో జొన్నకు డిమాండ్

చిరుధాన్యాల్లో జొన్న ముఖ్యమైంది. ఆరోగ్యం కోసం ఏకమొత్తంగా ఆహారం కోసం జొన్నలు తీసుకుంటున్నారు. అందుకని మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. క్వింటాలకు రూ.5వేల వరకు ధర పలుకుతోంది. ఎకరాలకు సగటున 30 క్వింటాల వరకు దిగుబడి వస్తుంది. జొన్నకు తెగుళ్ల బెడద ఆశించినంతగా ఉండదు. నెమళ్లు, అడవిపందుల బెడద నుంచి రక్షించుకునేందుకు శ్రమిస్తే చాలు.

సాగు విస్తీర్ణం పెరిగింది



జొన్న పంట గత సంవత్సరం కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. పంట విస్తీర్ణం పెరగడం మంచిదే. అధిక దిగుబడులను సాధించాలంటే ఆయా ప్రాంతాలకు అనువైన రకాల ఎంపిక, సాగు విధానంలో పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయి. జొన్నకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ధర కూడా ఆశాజనకంగా ఉండటం ద్వారా రైతులకు ఎక్కువ లాభం ఉంటుంది.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. జిన్నారం ఎస్‌ఐ విజయారావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సిరిగిరి గండయ్య (50) ఈ నెల 26న ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం సోలక్‌పల్లి గ్రామ శివారులోని ఓ గుంతలో గండయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గండయ్య మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు.


గండయ్య(ఫైల్)

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన అమీన్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్, పద్మావతి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ సాయంత్రం భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం భర్త శ్రీనివాస్ స్నానానికి వెళ్లగా కూతురు రియా(4)ను తీసుకొని పద్మావతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త శ్రీనివాస్ భార్య, కూతురు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం భార్య, కూతురు అదృశ్యంపై శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పద్మావతి

తల్లితో పాటు ఇద్దరు పిల్లలు అదృశ్యం

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌కు చెందిన శీను, భార్య సుజాతతో కలిసి బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం పటేల్‌గూడ వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా శ్రీను మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని భార్య చెప్పడంతో ఇరువురికి గొడవ జరిగింది. దీంతో సుజాత ఈ నెల 27వ తేదీన ఇద్దరు పిల్లలు గౌతం(7), గౌతమి(5) తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త శ్రీను భార్యాపిల్లల కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


సుజాత

సంక్షిప్త వార్తలు

◆ **నిరుపేదకు అంత్యక్రియలు**

జిన్నారం(పటాన్‌చెరు): నిరుపేదకు మున్సిపల్ అధికారులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి బంధువులు ఎవరూ లేకపోవడంతో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ సిబ్బందితో కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని మందుమూలలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయ జాతర ఏర్పాట్లను కార్పొరేటర్ పుష్ప శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

◆ **తరగతి గదులు ప్రారంభం**



మునిపల్లి(అందోల్): ఎల్‌అండ్‌టీ సంస్థ ఐడీపీఎల్ డెక్కన్ టోల్వేస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని లింగంపల్లి రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను రీజినల్ హెడ్ వినీష్‌కుమార్, ప్రాజెక్టు హెడ్ రాజేశ్ విచారే శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ చైతన్య, ఎల్‌అండ్‌టీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **బస్టాండ్ నిర్మించాలని వినతి**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో బస్‌స్టాండ్ నిర్మించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య శుక్రవారం ఆర్టీసీ ఆర్‌ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ బస్టాండ్ లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే బస్‌స్టాండ్‌ను నిర్మించాలని కోరారు.

◆ **బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా అన్నాజీశర్మ**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా గడియారం అన్నాజీను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వినోద్ పటేల్ వ్యవరించారు. బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామరావు దేశ్‌పాండే, ఉపాధ్యక్షులుగా ఫణిశర్మ, అనిల్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా వంశీకృష్ణ, వేణుగోపాల్‌శర్మ, కోశాధికారిగా మూర్తి, గౌరవ సలహాదారులుగా చంద్రబాబు శర్మతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు శేషాద్రిశర్మ పాల్గొన్నారు.

◆ **ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాచార్య మహాస్వామి హిరేమట్, ధనసిరి, సిద్దాపూర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ **రఘునందన్‌రావును గెలిపించాలి**

పటాన్‌చెరు టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సాయిసందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీగా రఘునందన్‌రావును గెలిపిస్తే మెదక్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

జహీరాబాద్ టౌన్: కేంద్ర పథకాలపై బీజేపీ నాయకులు పట్టణంలోని హమాలీ కాలనీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని కోరారు. ఆ పార్టీ నియోజవర్గం కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మఠం విశ్వనాథ్ స్వామి, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్ అరుణ కౌశాస్, అర్చన సరడా, పాలికర్ సంతోష్, విజయ్, సాయిరాం, శోభరాణి పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు పూడ్చివేత

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని ప్రధాన రహదారులపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో గుంతల పూడ్చివేత పనులను చేపట్టారు. రాజీవ్‌చౌక్ సమీపంలోని బస్‌షెల్టర్‌లో ఫ్లోరింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ఫ్లోరింగ్ వేసి మెట్లను ఏర్పాటు చేశారు.

గంజాయి మొక్కల ధ్వంసం

సదాశివపేట రూరల్: మండల పరిధిలోని తంగడపల్లి శివారులో సాగుచేసిన గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కంకోల్ రమేశ్ తన భూమిలో జొన్నపంటలో అంతరపంటగా గంజాయిని సాగుచేశాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐలు అనిల్‌కుమార్, యాదయ్య, సిబ్బంది అలిమ్, మాణిక్ ప్రభు, సతీశ్, మోహన్, గోపాల్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని గంజాయిని ధ్వంసం చేశారు. ఈ మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి దుక్కులపై రైతుల దృష్టి

రాయికోడ్(అందోల్): పంట కోతలు పూర్తి చేసిన రైతులు వేసవి దుక్కులు పూర్తి చేయడంపై దృష్టి సారించారు. మండలంలో సుమారు 35 వేల ఎకరాల సాగు భూమి ఉండగా యాసంగిలో భాగంగా 7,189 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. వానాకాలం పంటల సాగు పూర్తి చేసుకున్న రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని పూర్తి చేశారు. లోతు దుక్కులతో పొలాల్లో పెరిగే గడ్డి మొక్కలను నిలువరించి భూమిలోని పోషకాలను కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. పొలం వాలుకు అడ్డంగా దుక్కుకోవాలని సూచిస్తున్నారు. దీంతో నేల కోతకు గురి కాకుండా మట్టి, నీరు కొట్టుకుపోకుండా చీడపీడలను నివారించుకొని ఆశించిన దిగుబడి పొందే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.


కర్చల్ శివారులో సాగుకు సిద్ధం చేసిన దుక్కి


కోహీర్: పీచేర్యాగడి చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని చర్చిలను విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్దారు. జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్టు చర్చిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం ఉండాలని సూచించారు.


జహీరాబాద్ టౌన్: భక్తుల కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


హత్నూర: కాసాల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఝరాసంగం చర్చిలో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్

నమో యాప్‌తో చేరువ కావాలి


నమో యాప్‌ను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి: నమో యాప్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఆ పార్టీ కార్యాలయంలో నమో యాప్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ యాప్ ద్వారా ప్రజలు 100నుంచి 2వేల వరకు ఫండ్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిమామిడి రాజు, పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి, నాయకులు పాల్గొన్నారు.

పీఎఫ్ క్లెయిమ్స్‌పై చర్చాగోష్టి

పటాన్‌చెరు: భవిష్యనిధి, క్లెయిమ్ చట్టబద్ధమైన అంశాల పునరావలోకనంపై శుక్రవారం గీతం విశ్వవిద్యాలయంలో చర్చాగోష్టి నిర్వహించారు. హైదరాబాద్ ఇన్ సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (హెచ్‌ఐపీఏ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఎఫ్ క్లెయిమ్, ఇన్ సాల్వెన్సీ అండ్ బ్యాంక్స్‌పై కోడ్ 2016 (ఐబీసీ) గురించి సవివరంగా చర్చించి పరిష్కార మార్గాలను చూపారు. పటాన్‌చెరు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-1 విశాల్ అగర్వాల్ చార్టర్డ్ అకౌంటెంట్, ఇన్ సాల్వెన్సీ ప్రొఫెషనల్ మల్లికార్జున్ ప్రారంభ ఉపాన్యాసం చేశారు. చర్చాగోష్ఠిలో హెచ్‌ఎపీఏ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్లకు సన్మానం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని ఘనంగా సన్మానించారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. శైవక్షేత్రాల్లో ఒకటైన వీరభద్రస్వామి దేవాలయం అత్యంత ప్రచుర్యం పొందింది. ప్రతి ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఎప్పటిలాగే ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

- ముస్తాబైన వీరభద్రస్వామి ఆలయం
- 9రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు


వీరభద్రస్వామి ఆలయం... ఇన్‌సెట్‌లో కొలను

గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ (బొంతపల్లి)లో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం ఉంది. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాలకు జిల్లాలోని ఆయా ప్రాంతాలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 30న స్వామివారి ఉత్సవాలను ప్రారంభించే కార్యక్రమాలను చేపడతారు. సాయంత్రం నందీశ్వర వాహన సేవా కార్యక్రమం ఉంటుంది. 31న అశ్వవాహన సేవ, 01న హంసవాహన సేవ, 02న బృంగీశ్వర వాహన సేవ, 03న అగ్నిగుండాలు, పొన్నవాహన సేవ, 04న స్వామివారి కల్యాణోత్సవం, పల్లకివాహన సేవ, గజవాహనం 05న స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 06న దోపుసేవ, మిరిమిడి, పూర్ణాహుతి, నాకబలి నిర్వహిస్తారు. 07న స్వామివారి ఏకాంత, పవళింపు సేవ, డోలోత్సవం ఉంటుంది. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు అన్నదానం చేస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా కొలను

భద్రకాళీ సమేత వీఆరభద్రస్వామి దేవాలయం కొత్త అందాలను సంతరించుకుంది. దేవాలయానికి నాలుగు దిక్కుల గాలిగోపురాలను నిర్మించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయంలో కొలను ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సమీపంలోని పరిశ్రమలు, దాతలు అందించిన విరాళాలతోనే దేవాలయం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది.

ఇబ్బందులు లేకుండా చర్యలు



నేటి నుంచి ప్రారంభం కానున్న బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహించేవిధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. భక్తులు అధికసంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలి. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– శశిధర్‌గుప్తా, ఈఓ, వీరభద్రస్వామి ఆలయం